

# ఇద్దరి మనసులు 'ఒకటయాయి'

పి.ఉదయభాస్కర్

ఆమె నడుస్తూంది.

అతను నడవటం లేదు.

పరిగెడుతున్నాడు...ఆమె వెనుకే!

ఆమె చూసింది.

ఇతను చూశాడు.

జేబులో చెయ్యి పెట్టాడు.

ఓ కాగితం తీశాడు.... ఆమె కిచ్చాడు.

ఆమె పేరు కమల.

అతని పేరు రవి.

ఆ కాగితంలో వుందిలా :

"కమలరమణి విరబూయునులే అరుణోదయ వేళలో."

ఆమె తిరుగు జవాబిచ్చింది వెంటనే;

"చచ్చినా విరబూయదు."

* * *

ఆమె నడుస్తోంది.

అతనూ నడుస్తున్నాడు.... చేరువలోనే వున్నాడు గనుక!

ఆమె తెల్ల చీర కట్టుకుంది.

ఓ కాగితంలో రాసిచ్చాడిలా :

"తెల్లచీర కట్టుకున్న దెవరికోసమూ."

ఆమె జవాబిచ్చిందిలా;

"నీ కోసం మాత్రం కాదు"

పాత డైలాగే!

* * *

ఆమె నడుస్తూంది.

ఇతనూ నడుస్తున్నాడు.

ఆమె వెనక్కి తిరిగి చూసింది.

ఇతను మాత్రం ఎటూ తిరగలేదు:

నవ్వోందామె: కానీ

పలువరస తళుక్కుమన్లేదు.

అయినా, ఆమె నవ్వింది....కనుక యితను సకిలించాడు.

ఆమె పేరు సరోజ!

ఇతను రాసిచ్చాడిలా!

"కిరణాలలోనేగా సరోజం కిలకిల నవ్వేది"

ఆమె జవాబిచ్చిందిలా:

"నవ్వేనుగా!"

అంతే!

* * *

అతను నడుస్తున్నాడు

అతనిముందు వాళ్ళ నాన్నున్నాడు గుమ్మడిలాగా.

గర్జిస్తున్నాడు లయన్లాగా (లయననగా సింహము)

ఇతను జవాబిస్తున్నాడు కీట్లాగా!

కుదిరిందిద్దరి మధ్యా ఓ ఒప్పందం!

ఇప్పుడతను చేసుకోవాలి పెళ్ళి దాని ప్రకారం.

ఎవర్నీ అంటే.

ఉందిగా వాళ్ళ మేనత్తకూతురు మకరందం.

* * *

ఆమె నడుస్తూంది.

అతనూ నడుస్తున్నాడు.

తేడా ఏమిటంటే.

ఇద్దరూ పక్క పక్కగా నడుస్తున్నారు!

అతనంటున్నాడూ యిలా,

"సరూ! క్షమించు, నే నీకు చేశా మోసం!"

చెప్పబోయాడతడు చాలా చాలా.... కానీ,

ఆమె మధ్యలోనే అతన్నాపి అందిలా!

"ముందుగా నువ్వే నన్ను క్షమించు. నేనే నీకు చేశా మోసం!"

ఆశ్చర్యపోయాడతను "ఏమిటీ!"

"నా కిదివరకే పెళ్ళయిపోయింది" అందామె.

అంతే!



## జీవిత వివరాలు

పెరిగింది విజయనగరంలో. ఇంటర్ వరకూ చదువుకూడా విజయనగరంలో నే. ఇంటర్ ఫస్టియర్ మాత్రం గరివిడిలో చదివాను. ఇప్పుడు సెకెండియర్ విజయనగరం ఎం. ఆర్. కాలేజీలో చదూతున్నాను. "సాధ్యమైనంతవరకూ అందరినీ బోర్ కొట్టించడం హాబీ." ఇదే నా మొదటి కథ. ప్రచురించి, ప్రోత్సహించి నందుకు 'ఆంధ్రజ్యోతి' సంపాదకులకు నా కృతజ్ఞతలు.